సాక్షి
పెద్దపల్లి
మంగళవారం ⋮ 5 ⋮ నవంబర్ ⋮ 2024



శివాలయంలో పూజలు

జ్యోతినగర్(రామగుండం)... ఫ్యోటింక్లయిన్‌కాలనీ: కార్తీక మాసంలో తొలి సోమవారం సందర్భంగా విశ్వకర్మ శివాలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం 4గంటల నుంచే పూజలు చేయడం ప్రారంభించారు.



కలెక్టర్‌తో భేటీ

సుల్తానాబాద్: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ ఏఎంసీ చైర్మన్ మినుపాల ప్రకాశరావు సోమవారం కలెక్టర్ కోయ శ్రీహర్షను మర్యాద పూర్వకంగా కలిశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/22.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. పగలు ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

విద్యాప్రమాణాలు మెరుగుపర్చాలి



కోయ శ్రీహర్ష

జ్యోతినగర్(రామగుండం): ప్రభుత్వ పాఠశాలలను సమర్థవంతంగా నిర్వహించేందుకు హెడ్‌మాస్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. జిల్లాలోని స్కూల్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, ఎంఈవోలు, నోడల్ అధికారులతో స్థానిక ఎన్టీపీసీ కాకతీయ ఏసీ హాల్‌లో సోమవారం నిర్వహించిన సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు అందించే దిశగా పాటించాల్సిన పద్ధతులు, టీఎల్ఎం విధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. వచ్చే మూడు నెలల్లో 80 శాతం మందికిపైగా కనీస సామర్థ్యాలు సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు. డీఈవో మాధవి, సమగ్ర శిక్షా సమన్వయకర్త పీఎం షేక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఎంహెచ్‌వో అన్న ప్రసన్న



పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎంహెచ్‌వో ప్రసన్న

ఎలిగేడు(పెద్దపల్లి): ఇటీవల బదిలీపై వచ్చిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ(డీఎంహెచ్‌వో) అధికారి అన్న ప్రసన్న సోమవారం పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఎమ్మెల్యే స్వగ్రామం శివపల్లిలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

రేపు జాబ్ మేళా



పెద్దపల్లిరూరల్: హైదరాబాద్‌లోని కేఎల్ టెక్నికల్ సర్వీసెస్‌లో ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 6న (బుధవారం) కలెక్టరేట్‌లోని రూం నంబరు 225లో జాబ్ మేళానిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావు సోమవారం తెలిపారు. పూర్తి వివరాలకోసం సెల్ నంబర్లు 70931 72221, 89853 36947, 81212 62441లో సంప్రదించాలని ఆయన కోరారు.

పక్కాగా ఇంటింటి సర్వే

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టి, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన పొరపాట్లు లేకుండా పూర్తిచేయాలని ఆర్డీవో గంగయ్య సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు జిల్లా కేంద్రంలో సోమవారం ఇంటింటి సర్వేపై ఆయన అవగాహన కల్పించారు. సర్వేలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీవో ఫయాజ్, ఏపీఎం సంపత్, ఏపీవో రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

పెద్దపల్లిరూరల్: పెండింగ్‌లోని ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాలు వెంటనే విడుదల చేయాని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్నకొండ సాయిఆజాద్ అధ్యక్షతన జరిగింది. నూతన జాతీయ విద్యావిధానాన్ని అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానించాలన్నారు. విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులను అరకొరగానే కేటాయించారని ఆయన విమర్శించారు. విద్యారంగంపై సమీక్షించి విద్యార్థులకు మంచి భవిష్యత్ అందించేలా చొరవ చూపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రీతం, మాతంగి సాగర్, శివరామకృష్ణ, శ్రీవర్ధన్, అభిరాం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'టాస్క్' శిక్షణ ప్రారంభం

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన 'టాస్క్' కేంద్రంలో సోమవారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. తొలిబ్యాచ్‌లో 187 మంది ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. అయితే, సోమవారం 51మంది హాజరయ్యారు. టాస్క్ రీజినల్ హెడ్ సవీన్‌రెడ్డి, క్లస్టర్ మేనేజర్ సుధీర్ శిక్షణ గురించి వివరించారు. టాస్క్ సెంటర్ ప్రారంభం, తొలిరోజు శిక్షణ తీరును కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ కోయ శ్రీహర్షను కలిసి వివరించామని అధికారులు పేర్కొన్నారు.

10రోజులపాటు ఉచిత శిక్షణ..

ఆసక్తి, అర్హత గల యువతీయువకులకు తొలి బ్యాచ్‌లో 10రోజుల పాటు ఉచితశిక్షణ ఇస్తున్నట్లు టాస్క్ మేనేజర్ గంగాప్రసాద్ తెలిపారు. టాస్క్ ద్వారా కనీసం 10రోజులు సాఫ్ట్‌స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తామని, ఇది పూర్తయ్యాక ఉద్యోగావకాశాలను కల్పిస్తామని అన్నారు. వివరాలకు సెల్ నంబరు 70755 22671లో సంప్రదించాలని ఆయన కోరారు.

సర్వేకు అంతా సిద్ధం

జిల్లాలో రేపటి నుంచి కులగణన

- ప్రతీ ఇంటికి స్టిక్కర్స్‌తో నంబరింగ్
- సంక్షేమ పథకాల లబ్ధికే సర్వే
- రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి



రామగుండంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ సమక్షంలో ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న సిబ్బంది

సాక్షి, పెద్దపల్లి: జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కులగణనకు శ్రీకారం చుట్టింది. దీనిద్వారా కేవలం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించటమే కాకుండా భవిష్యత్‌లో సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపికకు ఉపయోగపడేలా సర్వే నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా ఈనెల 6న(బుధవారం) సర్వే చేసేందుకు అధికార యంత్రాంగం సర్వసన్నద్ధమైంది. నిర్దేశిత ప్రొఫార్మా ప్రకారం అన్నివర్గాల సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల గణన చేపట్టనున్నారు. ఇందులో భాగంగా 150 ఇళ్లకు ఒక ఎన్యూమరేటర్, 10 మంది ఎన్యూమరేటర్ల ఒక సూపర్‌వైజర్‌ను నియమించారు. సిబ్బంది నియామకం, సర్వే నిర్వహణపై శిక్షణ కూడా నిర్వహిస్తున్నారు. దీంతోపాటు ప్రతీ మండలానికి ఒకజిల్లాస్థాయి అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించి సర్వేలో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా పర్యవేక్షించనున్నారు.

ఇంటింటికీ స్టిక్కర్..

కులగణన సర్వేలో భాగంగా అధికార యంత్రాంగం జిల్లాలోని ఇళ్ల లెక్కలను తీయనుంది. గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు మొదలుకుని ఎంపీడీవోల స్థాయి వరకు అధికారులంతా ఇంటి నంబరు ఇచ్చే పనిలో నిమగ్నమయ్యారు. ఇంటి గోడలపై అతికించే స్టిక్కర్లపై యజమాని పేరు, ఇంటి నంబర్, వార్డు వివరాలు నమోదు చేస్తున్నారు.

56 ప్రధానం.. 19 అనుబంధం..

బుధవారం నుంచి ఇంటింటి సర్వేకు అధికార యంత్రాంగం ప్రజల ముందుకు రానుంది. సర్వేను ప్రశ్నావళి రూపంలో నిర్వహిస్తారు. అందులో ప్రధానంగా 56 ప్రధాన ప్రశ్నలు, 19 అనుబంధ ప్రశ్నలు ఉంటాయి. ముఖ్యంగా కుటుంబ యజమాని, సభ్యుల పేర్లు, మతం, సామాజికవర్గం, వయసు, మాతృభాష, బ్యాంకు రుణం, స్థిర, చరాస్తుల సమాచారం, పశుసంపద, వలస, చదువు తదితర వివరాలు అడుగుతారు. దీనికోసం కుటుంబంలోని సభ్యుల ఆధార్‌కార్డు, ధరణి పాసుపుస్తకాలు, రేషన్ కార్డు, ఇంటిపన్ను రసీదు, మొబైల్ నంబర్, దివ్యాంగులైతే సదరం సర్టిఫికెట్ అందుబాటులో ఉంచుకోవాలని సూచిస్తున్నారు. వీటిద్వారా సర్వే సులభంగా పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. సర్వే అధికారులు వచ్చే సమయంలో ఇంట్లో అందరూ ఉండాల్సిన అవసరం లేదు. యజమాని ఉండి ఆయా వివరాలను చెబితే సరిపోతుంది. సర్వే సందర్భంగా ఎలాంటి ఫొటోలు, పత్రాలు తీసుకోరని, వివరాల సేకరణలో గోప్యత, నైతిక ప్రమాణాలు పాటించేలా చూస్తామని అధికారులు చెబుతున్నారు.

2011 జనాభా లెక్కల ప్రకారం..

జిల్లా జనాభా	7,95,332
కుటుంబాల సంఖ్య	2,50,000
పురుషులు	3,99,325
మహిళలు	3,96,007
ఎస్సీలు	1,54,855
ఎస్టీలు	14,945

సర్వే సమాచారం

బ్లాక్‌లు	1,800
సూపర్‌వైజర్లు	200
ఎన్యూమరేటర్లు	1,900

పరిశీలించండి.. పరిష్కరించండి

ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు అభాగ్యుల వినతి

- సింగరేణి నిర్వాసిత పెద్దంపేట గ్రామస్తులం. చాలామంది ఇంకా ఆ ఊరిలోనే ఉంటున్నరు. పిల్లల చదువులకు అవసరమైన కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణపత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటే రామగిరి తహసీల్దార్ ఇవ్వనంటున్నారు. సర్టిఫికెట్లు ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వండి.
  – మాజీ సర్పంచ్ చింతపట్ల నాగరాజు



పెద్దపల్లిరూరల్: జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి కలెక్టరేట్‌కు తరలివచ్చిన ప్రజలు అడిషనల్ కలెక్టర్ వేణుకు సమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి ద్వారా స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను అదనపు కలెక్టర్ వేణు ఆదేశించారు.



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ వేణు

రేషన్‌షాపు మంజూరు చేయాలి



బొంపల్లి పంచాయతీ పరిధిలోని శివారు గ్రామం మేరపల్లిలో రేషన్ షాపు ఏర్పాటు చేయాలి. ఈ గ్రామస్తులు సరుకుల కోసం సుదూరంలోని బొంపల్లికి వెళ్లాల్సి వస్తోంది. 300 కుపైగా రేషన్‌కార్డులు, 1,500మంది జనాభా ఉన్న మా ఊరుకు రేషన్‌షాపు మంజూరు చేయాలి.
– దాడి సంతోష్, మేరపల్లి

గృహజ్యోతి వర్తింపజేయాలి



మాది నిరుపేద కుటుంబం. ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం కోసం దరఖాస్తు చేసుకున్న. అయినా నాకు పథకం వర్తింపజేయలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ పథకం వర్తింపజేయాలి.
– మహమ్మద్‌అలీ, బొంపల్లి

దారి ఆక్రమించారు



మా ఊరు శివారులోని మా భూమికి వెళ్లే దారిని కొందరు అక్రమంగా ఆక్రమించుకున్నారు. దివ్యాంగుడైన నా భర్తపై అక్రమంగా కేసులు బనాయించి మానసిక వేదనకు గురిచేస్తున్నారు. ఈ విషయంపై విచారణ జరిపించి మాకు న్యాయం చేయాలి.
– యాదగిరి భాగ్యలక్ష్మి, రాగినేడు

తూకంలో తేడా వస్తే సహించేది లేదు

- ఎమ్మెల్యే విజయరమణారావు



కొనుగోళ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): ధాన్యం తూకంలో తేడా వస్తే సహించేది లేదని ఎమ్మెల్యే విజయరమణారావు హెచ్చరించారు. గర్రెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నారాయణరావుపల్లి, సాంబయ్యపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ధాన్యంలో తేమశాతం 17కు మించవద్దన్నారు. ధాన్యం తూకం వేసిన వెంటనే రైతుకు ట్రాక్‌షీట్ ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ ప్రకాశ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ సందీప్‌రావు, వైస్ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు సతీశ్, జానీ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ధాన్యం కొనుగోళ్లు

ధర్మారం(ధర్మపురి): ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. పలు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సోమవారం తనిఖీ చేశారు. అక్కడ కల్పించిన వసతులపై ఆరా తీశారు. రైతుల నుంచి నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. వరికోత సమయంలో హార్వెస్టర్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారులకు సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, సహకార అధికారి శ్రీమాల, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల తర్వాత ఆస్తిపన్ను బకాయిల వసూలు

- రెవెన్యూ రికవరీ యాక్ట్‌తో దిగివస్తున్న బకాయిదారులు
- తహసీల్దార్ సమక్షంలో రూ.3.74లక్షలు చెల్లింపు
- నోటీసులు అందుకున్న మరో ఎనిమిది మందిలో గుబులు



బకాయిలు చెల్లిస్తున్న థియేటర్ యాజమాన్యం

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలో ఏళ్లుగా ఆస్తిపన్ను చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న బకాయిదారులకు రెవెన్యూ రికవరీ యాక్ట్ గుబులు పుట్టిస్తోంది. బకాయిదారుల ఆస్తులను వేలం వేసి బకాయిలు వసూలు చేసేలా రెవెన్యూ శాఖ అధికారులు నోటీసులు జారీచేస్తున్నారు. ఫలితంగా మొండి బకాయిదారుల్లో స్పందన వస్తోంది. సోమవారం ఫ్యోటింక్లయిన్‌కాలనీలోని సదానందం సినిమా థియేటర్ యాజమాన్యం ఆస్తిపన్ను బకాయిలు చెల్లించడానికి ముందుకు వచ్చింది. ఐదేళ్ల ఆస్తిపన్ను బకాయిలు రూ.3.74 లక్షలు వెంటనే చెల్లించకుంటే రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం థియేటర్‌ను వేలం వేస్తామనే కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాలతో రామగుండం తహసీల్దార్ కుమారస్వామి ఇటీవల యాజమాన్యానికి నోటీసులు జారీచేశారు. దీంతో స్పందించిన థియేటర్ యజమాని సోమవారం రూ.3.74లక్షల ఆస్తిపన్ను చెల్లించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రూ.లక్షల్లో ఆస్తిపన్ను చెల్లించని మరో ఎనిమిది మందికి ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. సకాలంలో బకాయిలు చెల్లించకుంటే ఆస్తులను వేలం వేస్తాని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్‌వో ఆంజనేయులు, ఆర్ఐ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేశోరాంలో రిలే నిరాహార దీక్ష



దీక్షలో కార్మిక సంఘం నేతలు

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం కార్మికులకు మెరుగైన బోనస్ చెల్లించాలనే డిమాండ్‌తో పర్మినెంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి సోమవారం ఫ్యాక్టరీ ఎదుట రిలే నిరాహారదీక్ష చేపట్టారు. గతేడాది పర్మినెంట్ కార్మికులకు దీపావళి బోనస్ రూ.46,800 చెల్లించిన యాజమాన్యం.. ఇప్పుడు రూ.16,800 మాత్రమే కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమచేసిందన్నారు. ఇదే విషయంపై చర్చలు జరుగుతున్నా ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. కర్ణాటకలోని వాసవిదత్తా సిమెంట్ కంపెనీ కార్మికులతో సమానంగా బోనస్ చెల్లించే వారని, ప్రస్తుతం అదేవిధంగా రెండురోజుల్లో బోనస్ చెల్లించకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని ఆయన హెచ్చరించారు.

'అమృత్' ద్వారా ప్రతీ ఇంటికి నీరు



పనులు ప్రారంభిస్తున్న కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే కమలాకర్, మేయర్ సునీల్‌రావు

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్
- ఫేజ్–2 పనులకు శంకుస్థాపన

కరీంనగర్ కార్పొరేషన్: అమృత్ పథకం ద్వారా ప్రతీ ఇంటికి నీరందించడమే లక్ష్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. అమృత్–2 పథకం కింద రూ.147 కోట్లతో కరీంనగర్‌లో చేపట్టనున్న పనులకు ఫిల్టర్‌బెడ్ వద్ద ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ యాదగిరి సునీల్‌రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిలతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమృత్ పథకాన్ని 2015లో ప్రారంభించామన్నారు. అమృత్–1 కింద దేశవ్యాప్తంగా రూ.50 వేల కోట్లు వెచ్చించి, 1.34 కోట్ల నల్లా కనెక్షన్లు, 1.02 కోట్ల డ్రైనేజీ కనెక్షన్లు ఇచ్చామని పేర్కొన్నారు. అమృత్–2లో భాగంగా రూ.2.99 లక్షల కోట్లతో దేశంలోని మున్సిపాలిటీలు, నగరాల్లో ప్రజల దాహార్తిని తీర్చబోతున్నామని తెలిపారు. తెలంగాణకు రెండు ఫేజ్‌లలో రూ.6,876 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఇందులో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సంబంధించి రూ.852.11 కోట్లు ఉన్నాయన్నారు. నగరపాలక సంస్థలో అమృత్–1 కింద రూ.136.56 కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. అమృత్–2లో మొత్తం 159.55 కిలోమీటర్ల మేర పనులు చేసి, మరో 10,500 కుటుంబాలకు నల్లా కనెక్షన్ ఇస్తామన్నారు. రూ.18 కోట్లతో హౌసింగ్‌బోర్డు రిజర్వాయర్ పరిధిలోని 5 డివిజన్లకు 24 గంటలు నీటి సరఫరా చేయనున్నట్లు చెప్పారు. ప్రసాద్ స్కీం కింద కొండగట్టు, వేములవాడ, ఇల్లందకుంట ఆలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. కరీంనగర్‌లో టీటీడీ ఆలయ నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే నూతన చైర్మన్‌తో మాట్లాడినట్లు తెలిపారు. ఎమ్మెల్యే కమలాకర్ మాట్లాడుతూ.. అమృత్–2 పనులు పూర్తయితే విలీన గ్రామాలకు తాగు నీరందించడంతోపాటు, 24/7 నీటి సరఫరా లక్ష్యం నెరవేరుతుందన్నారు. వేదిక పైన బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులం ఉన్నామని, అభివృద్ధి కోసం రాజకీయాలు పక్కన పెట్టాలని సూచించారు. మానేరు రివర్ ఫ్రంట్ 60 శాతం పూర్తయిందని, మిగతా 40 శాతం పనులు పూర్తి చేసేందుకు కేంద్ర సహాయమంత్రిగా బండి సంజయ్ నిధులు తీసుకురావాలని కోరారు. డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్, కార్పొరేటర్లు, ప్రజారోగ్యశాఖ, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

ఫోన్ చేసి.. ఏమార్చి

- ఓ సైబర్ మోసగాడు.. పక్కాగా ప్లాన్ చేశాడు.. బిర్యానీ పార్శిళ్లు, ఎగ్‌బిర్యానీ ప్యాకెట్లు కావాలని ఆర్డర్ చేసి ఆ సొమ్ము మినీ ఏటీఎం సెంటర్‌లో చెల్లిస్తారని ఫోన్ ద్వారా హోటల్ నిర్వాహకులకు తెలియజేశాడు. అతడు చెప్పినట్లే హోటల్ యజమానులు ఏటీఎం సెంటర్లకు వెళ్లారు. వారి ఎదుటే ఏటీఎం సెంటర్ నిర్వాహకుల నుంచి రూ.1.02లక్షలు ఫోన్ పే ద్వారా తనకు బదిలీ చేయించుకున్నాడు అగంతకుడు. ఆ సొమ్మును హోటల్ నిర్వాహకులు చెల్లిస్తారని వారికి చెప్పి ఫోన్ కట్‌చేశాడు. దుండగుడు చెప్పినట్లు హోటల్ యజమానులు ఏటీఎం సెంటర్ల యజమానులను డబ్బుల గురించి అడుగగా.. మీరే తమకు డబ్బులు ఇస్తారని ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి చెప్పాడని వారు బదులిచ్చారు. ఇలా పరస్పరం ప్రశ్నించుకున్నాక అవతలి వ్యక్తికి ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. గత బుధవారం జరిగిన ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

- ఏపీకి చెందిన వెంకటనాగరాజు– సౌజన్య దంపతులు. ఈజీగా మనీ సంపాదించేందుకు మ్యాట్రిమోని(పెళ్లి సంబంధాలు కుదిర్చే) యాప్‌ను ఓపెన్ చేసి అవివాహితులకు ఫ్రెండ్స్ రిక్వెస్ట్ పంపించేవారు. రామగుండం పోలీసు కమిషనరేట్‌లోని మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ యువకుడు వీరి వలలో చిక్కాడు. పెళ్లి అవుతుందనే ఆశతో దంపతులు అడిగినట్లు పలు దఫాలుగా రూ.17లక్షలను వారికి బదిలీ చేశాడు. ఆ తర్వాత పెళ్లి గురించి ప్రస్తావించగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. బాధితుడి ఫిర్యాదుతో దంపతులను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు.



గోదావరిఖని: సైబర్‌నేరగాళ్లు రూటు మార్చుతున్నారు. అమాయకులను ఏమార్చి అందినంత కాజేస్తున్నారు. రామగుండం పోలీసు కమిషనరేట్‌లో గత రెండేళ్లలో ఇలా సుమారు రూ.7.24 కోట్లు కొల్లగొట్టారు. ఆన్‌లైన్, బ్యాంక్ లావాదేవీలు, ఆన్‌లైన్ లింక్‌లు పంపిస్తూ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు.

చిరు వ్యాపారులూ టార్గెటే..

చిరు వ్యాపారులను టార్గెట్‌గా ఎంచుకున్న సైబర్ నేరగాళ్లు వారి అకౌంట్ల నుంచి సొమ్ము కొల్లగొడుతున్నారు. సామాజిక మాధ్యమాలు, మీడియా ద్వారా పోలీసులు రోజూ అవగాహన కల్పిస్తున్నా.. అమాయకులు వారిచేతిలో మోసపోక తప్పడం లేదు.

స్థానికులేనా?

కొద్దిరోజులుగా జిల్లాలో చోటుచేసుకుంటున్న సైబర్ నేరాల్లో స్థానికుల హస్తం కూడా ఉండిఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. స్థానికుల హస్తం లేకుంటే గోదావరిఖనిలోని బకెట్ బిర్యానీ, మినీ ఏటీఎంల విషయం ఎక్కడో ఉన్న సైబర్ నేరగాళ్లకు ఎలా తెలుస్తుందని వారు వివరిస్తున్నారు. మినీ ఏటీఎంలు కస్టమర్లతో రద్దీగా ఉన్న సమయాన్నే వారు ఎంచుకుంటున్నారు. గోదావరిఖనిలో గత బుధవారం రెండు ఘటనలు చోటుచేసుకోవడం ఇందుకు నిదర్శనమని వ్యాఖ్యానిస్తున్నారు.

ఇంటర్నెట్ ఫోన్‌కాల్..

సైబర్ నేరగాళ్లు ఇంటర్నెట్ ద్వారా ఫోన్ కాల్స్ చేస్తూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకుంటున్నారు. ఇంకా ఎవరికీ కేటాయించని ఫోన్ నంబర్లను ఆన్‌లైన్‌లో గుర్తించి వాటిద్వారా అమాయకులకు ఫోన్‌లు చేస్తూ బ్యాంకు ఖాతాల్లోని సొమ్ము కొల్లగొడుతున్నారని పోలీసులు గుర్తించారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి..

- వేర్వేరు బ్యాంకు ఖాతాలకు ప్రత్యేక, స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌లు ఏర్పాటు చేసుకోవాలి
- తరచూ పాస్‌వర్డ్‌లు మార్చాలి
- చట్టబద్ధ సంస్థ వీడియో కాల్‌చేసి ధ్రువీకరణ కోసం బ్యాంకు ఖాతాకు డబ్బులు బదిలీ చేయాలని అడగదు.
- ఆర్థిక లావాదేవీలు మెసేజ్‌లు, ఈ మెయిల్స్‌తో జాగ్రత్తగా ఉండాలి
- అపరిచితులు, అపరిచిత సంస్థలతో ఆన్‌లైన్, వ్యక్తిగత, ఆర్థిక సమాచారం పంచుకోవద్దు.

అప్రమత్తంగా ఉండాలి – పోలీసులు

"అపరిచితుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దు. పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు రహస్యంగా ఉంచుకోవాలి. బ్యాంకు ఖాతాల అడ్మిన్‌ను గుర్తుతెలియని వారికి ఇవ్వవద్దు. సైబర్ మోసగాళ్ల బారినపడ్డ వారు గంట(గోల్డెన్ అవర్)లోపే 1930 హెల్ప్ లైన్ నంబర్‌కు ఫోన్‌చేయాలి. లేదా cybercrimegov.in. పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి."

సైబర్ నేరాల సమాచారం

సంవత్సరం	2023	2024 (ఇప్పటివరకు)
సైబర్ నేరాలు	315	299
కోల్పోయిన సొమ్ము(రూ.లలో)	4,14,80,423	4,30,00,000
రికవరీ చేసిన సొమ్ము(రూ.లలో)	57,817	6,80,000
రికవరీ చేయాల్సింది(రూ.లలో)	4,14,22,606	4,23,20,000

క్లుప్తంగా

ట్రాక్టర్ల బ్యాటరీలు, పట్టీలు చోరీ



బ్యాటరీలు, పట్టీల చోరీకి గురైన ట్రాక్టర్లు

గన్నేరువరం(మానకొండూర్): మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామంలో 14 ట్రాక్టర్లకు చెందిన హైడ్రాలిక్ పట్టీలు, 5 బ్యాటరీలు చోరీకి గురైనట్లు ఎస్సై తాండ్ర నరేశ్ తెలిపారు. వివిధ రకాల ధాన్యంతో లోడు చేసిన ట్రాక్టర్లను సంబంధిత యజమానులు ఆదివారం గునుకుల కొండాపూర్ నుంచి చీమలకుంటపల్లె గ్రామానికి వెళ్లే రహదారి పక్కన నిలిపి ఉంచారు. సోమవారం ఉదయం చూసే సరికి ట్రాక్టర్లకు సంబంధించిన బ్యాటరీలు, పట్టీలు లేవు. చోరీకి గురైనట్లు గుర్తించారు. గ్రామ ట్రాక్టర్స్ యునియన్ సభ్యుడు సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మేడిపల్లి(వేములవాడ): గంజాయి విక్రేతను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన సయ్యద్ యూసఫ్ వ్యసనాలకు అలవాటు పడి ఈజీగా డబ్బు సంపాదించేందుకు గంజాయి అమ్మడం అలవాటు చేసుకున్నాడు. సోమవారం ఉదయం భీమారం మండలంలో గంజాయి విక్రయించేందుకు వస్తుండగా తనిఖీల్లో భాగంగా మేడిపల్లి మండలకేంద్రంలోని పెట్రోల్ బంకు సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 160 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. సమావేశంలో సీఐ సురేశ్‌బాబు, ఎస్సై శ్యాంరాజ్, సిబ్బంది చంద్రశేఖర్, అనిల్ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



సుధాకర్(ఫైల్)

సిరిసిల్లక్రైం: జీవనోపాధి కోసం చేసిన అప్పులు అధికమవడంతో అవి తీర్చే మార్గం లేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో సోమవారం జరిగింది. పోలీసుల వివరాలు.. తంగళ్లపల్లి మండలం కందికట్కూరుకు చెందిన వెలిశాల సుధాక ర్ (40) సిరిసిల్ల పరిధిలోని చంద్రంపేటలో కట్టె కోత మిషన్ నిర్వహిస్తూ 20 ఏళ్లుగా జీవనోపాధి పొందుతున్నాడు. వ్యాపార నిమిత్తం బ్యాంకుల్లో చేసిన అప్పుల అధికమవడంతో వాయిదాలు చెల్లించడం ఇబ్బందిగా మారింది. దీనికి తోడు ఆరోగ్యం సహకరించకపోవడంతో వ్యా పారం మరింత దెబ్బతిన్నది. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపం చెంది చంద్రంపేటలో కట్టెకోత మిషన్ షెడ్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య లత, 8 ఏళ్ల కొడుకు, ఐదేళ్ల కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.







కార్తీకం.. శుభకరం

పవిత్ర కార్తీక మాసం ప్రారంభమైంది. తొలిసోమవారం కావడంతో భక్తులు శివాలయాల్లో ప్రత్యేకపూజలు చేశారు. తమ కుటుంబాలను చల్లంగా చూడాలని భోళాశంకరునికి పూజలు చేశారు. దీపారాధన, పాలాభిషేకంతో మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దపల్లితోపాటు గోదావరిఖని, మంథని, సుల్తానాబాద్ తదితర ప్రాంతాల్లోని శివాలయాలు భక్తులతో రద్దీగా మారాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

బాలుడి కిడ్నాప్ కేసు సుఖాంతం

- తల్లి నుంచి అపహరించి రూ.50 వేలకు అమ్మకం
- ముగ్గురిని రిమాండ్ చేసిన పోలీసులు



నిందితుల అరెస్టు చూపుతున్న వన్‌టౌన్ సీఐ కోటేశ్వర్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లో రెండున్నరేళ్ల బాలుడి కిడ్నాప్ కేసు సుఖాంతమైంది. కిడ్నాప్‌నకు గురైన బాలుడిని తల్లి వద్దకు పోలీసులు చేర్చారు. ఈ కేసులో ముగ్గురిని సోమవారం అరెస్టు చేసి జైలుకు తరలించారు. వన్‌టౌన్ సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపిన వివరాలు.. గత నెల 27న కామారెడ్డికి చెందిన కరీంనగర్, చాకలివాడలో నివాసముంటున్న షేక్‌లీనా తన రెండున్నరేళ్ల కుమారుడిని కిడ్నాప్ చేశారని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను పట్టుకునేందుకు ఎస్సై రాజన్న, కానిస్టేబుళ్లు కుమార్, బషీర్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీం ఏర్పాటు చేసి బాలుడి ఆచూకీ కోసం గాలించారు. సీసీ ఫుటేజీ, ఇతర టెక్నాలజీ ఆధారంగా నిందితులు కరీంనగర్ చాకలివాడకు చెందిన దాసరి స్వరూప అలియాస్ సరోజ, మోతె కృష్ణ కిడ్నాప్ చేసినట్లు గుర్తించారు. అనంతరం బాలుడిని సాధనవేణి అలియాస్ బొజ్జ లలియా అలియాస్ లత, సాధనవేణి రమేశ్ దంపతులకు రూ.50 వేలకు అమ్మారు. ఈ కేసులో మోతె కృష్ణ పరారీలో ఉన్నాడు. దాసరి స్వరూప అలియాస్ సరోజ, సాధనవేణి లలియా, రమేశ్‌ను జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

పెంపుడు కుక్కను ఎత్తుకెళ్లారు!



చోరీకి గురైన హచ్ కుక్క

మంథని: ముగ్గురు ముసుగు దొంగలు.. అందులో ఒకరు యువతి.. వీరందరూ కలిసి శనివారం రాత్రి పల్సర్ బైక్‌పై బయలు దేరారు. పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ పరిధిలోని శ్రీరాంనగర్‌లో నివాసం ఉండే నారాయణ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఇంతకీ వారు చోరీ చేసింది ఏమిటో తెలుసా..? నారాయణ కుటుంబ సభ్యులు అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న హచ్‌రకం పెంపుడు కుక్కను. యువతి తీసుకొచ్చిన చున్నీలో శనకాన్ని దాచిపెట్టుకుని ఎవరి కంటా పడకుండా వచ్చిన దారి వెంటే బైక్‌పై పరారయ్యారు. ఈ దృశ్యాలు రామగిరి మండలం లద్నాపూర్ సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఇంటి ఎదుట గేటు కాస్త తెరిచి ఉండడం దొంగలు తమ పనికానిచ్చేయడానికి సహకరించిందని, క్షణాల్లో తమ కుక్క మాయమైందని బాధితులు లబోదిబోమంటున్నారు. అంతేకాదు.. కుక్క చోరీకి గురైందనే బాధతో రెండ్రోజులుగా వారు అన్నపానీయాలు కూడా ముట్టుకోవడం లేదు. ఈ విషయంపై బాధితులు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుక్కను వెతికే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

రూ.10వేలకు కొనుగోలు..

కుక్కపిల్లను సుమారు నాలుగేళ్ల క్రితం హైదరాబాద్‌లో కొనుగోలు చేశారు. అప్పట్నుంచి ఇంట్లో కుటుంబసభ్యురాలుగా పెంచుకుంటున్నారు. దీని ప్రత్యేకత ఏమిటంటే.. ఇంట్లోని వారితోపాటు ఇంటికి ఎవరు వచ్చినా ఆప్యాయంగా ఉంటుందీ శునకం.

బీజేపీ సంస్థాగత ఎన్నికలకు సమాయత్తం

పెద్దపల్లిరూరల్: భారతీయ జనతా పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్వహణకు అధిష్టానం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. సాధారణ సభ్యత్వం పూర్తికాగా క్రియాశీల సభ్యత్వ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. మండల, జిల్లా పార్టీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారులను నియమిస్తూ అధిష్టానం ఓ జాబితా ఖరారు చేసింది. జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఆదిలాబాద్‌కు చెందిన అయ్యన్నగారి భూమయ్యను నియమించారు. అలాగే సహాయ ఎన్నికల అధికారులుగా గోదావరిఖనికి చెందిన క్యాతం వెంకటరమణ, పెద్దపల్లికి చెందిన పోల్సాని సంపత్‌రావును నియమించారు.

మరోసారి ఎల్‌ఎండీ గేట్లు ఎత్తిన అధికారులు

తిమ్మాపూర్: ఎస్సారెస్పీ వరద కాల్వ ద్వారా మిడ్ మానేరులోకి నీరు చేరడంతో ఎల్‌ఎండీ జలాశయం పూర్తిగా నిండడంతో వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు వదలాలని అధికారులు నిర్ణయించారు. ఉన్నతాధికారుల సూచన మేరకు సోమవారం ఎల్‌ఎండీ రెండు గేట్లు ఎత్తి 2వేల క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదలచేశారు. పశువుల కాపరులు, మత్స్యకారులు వాగులోకి వెళ్లొద్దని సూచించారు. నది పరీవాహక ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈఈ నాగభూషణం సూచించారు..

నేడు డీఈవోపై విచారణ

కరీంనగర్: డీఈవో జనార్దన్‌రావుపై మంగళవారం ఆయన కార్యాలయంలో వరంగల్ ఆర్‌జేడీ బృందం ఉదయం 11 గంటలకు విచారణ జరపనుంది. డీఈవో అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని డీటీఎఫ్, యూటీఎఫ్, టీపీటీఎఫ్ జిల్లా నాయకులు గతంలో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. చిన్న చిన్న కారణాలతో టీచర్లకు మెమోలు ఇవ్వడం, సస్పెండ్ చేయడం, ఎస్సెస్సీ స్పాట్ వాల్యుయేషన్ సమయంలో వందలాది మంది ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేయడం, ఉపాధ్యాయ సంఘాల నాయకులను విస్మరించడం, కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, డీఈవో విద్యార్హత పత్రాల గోప్యత, సమాచార హక్కు చట్టం కింద కొన్ని విషయాలు అడిగితే స్పందించకపోవడం, సంబంధం లేని విషయాలపై టీచర్లు ఫోన్‌లో సమాధానం ఇవ్వాలనడం.. ఇలా మొత్తం 27 అంశాలను ఫిర్యాదులో పేర్కొన్నారు.

'జ్యోతిష్మతి' విద్యార్థికి భారీ ప్యాకేజీతో ఉద్యోగం

తిమ్మాపూర్: స్థానిక జ్యోతిష్మతి ఇంజినీరింగ్(అటానమస్) కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) విద్యార్థికి ఏడాదికి రూ.19 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం లభించినట్లు కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు తెలిపారు. ఎల్‌ఎండీ కాలనీకి చెందిన నేదునూరి జయంత్ జ్యోతిష్మతి కలాశాలలో 2023లో ఈసీఈ విభాగంలో ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. హైదరాబాద్ లోని కాడేన్స్ డిజైన్ సిస్టమ్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ లో డిజైన్ ఇంజినీర్‌గా ఉద్యోగ నియామకం పొందాడు. విద్యార్థి తండ్రి శ్రీనివాస్ నీటి పారుదల శాఖలో ఆఫీస్ సబ్‌ఆర్డినేటుగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ జువ్వాడి సాగర్ రావు, సెక్రటరీ సుమిత్ సాయి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

మరణంలోనూ పలువురికి పునర్జన్మ

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి బ్రెయిన్ డెడ్
- పుట్టెడు దుఃఖంలోనూ కుమారుడి అవయవదానం చేసిన తల్లిదండ్రులు



సాయినితీశ్(ఫైల్)

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): మరణంలోనూ ఓ యువకుడు నలుగురికి పునర్జన్మనిచ్చాడు. పుట్టెడు దుఃఖంలోనూ తల్లిదండ్రులు తమ కుమారుడి అవయం దానం చేసి ఆదర్శంగా నిలిచారు. మాతంగి కాలనీలో గతనెల 24న జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ వెనకాల కూర్చున్న వంశీ అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న మాదాసు సాయినితీశ్ తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా సోమవారం బ్రెయిన్ డెడ్ అయ్యింది. దీంతో తండ్రి మాదాసు మల్లేశ్ – ఉమ దంపతులు తమ కుమారుడి అవయవ దానానికి ముందుకు వచ్చారు. వివరాలు.. గోదావరిఖని తిలక్‌నగర్‌కు చెందిన మాదాసు మల్లేశ్ – ఉమ దంపతుల కుమారుడు సాయినితీశ్(22). డిగ్రీ పూర్తి చేశాడు. గత నెల 24న స్నేహితుడు వంశీతో కలిసి బైక్‌పై వెళ్తుండగా మాతంగికాలనీలో ప్రమాదానికి గురయ్యాడు. వంశీ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన నితీశ్‌ను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతుండగా బ్రెయిన్ డెడ్ అయ్యింది. నితీశ్ బతకడం కష్టమని డాక్టర్లు చెప్పడంతో తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. అయినా, అతడి అవయవాలను దానం చేస్తే కొందరికి పునర్జన్మ ప్రసాదించవచ్చని భావించారు. జీవన్‌ధాన సంస్థ ప్రతినిధుల చొరవతో గుండె, కిడ్నీలు, కాలేయం దానం చేశారు. మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పరామర్శించారు.

పుత్రభిక్ష పెట్టండి

- కొడుకు కోసం తల్లిదండ్రుల ఆరాటం
- నెలకు వైద్యానికి రూ.2.50 లక్షలు..
- ఇప్పటి వరకు రూ.30 లక్షలు ఖర్చు
- ఆపన్నహస్తం అందించాలని వేడుకోలు



కొడుకును బతికించాలని వేడుకుంటున్న తల్లి

రాయికల్(జగిత్యాల): చేతికందే సమయంలో కొడుకు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఎలాగైనా కన్న పేగును దక్కించుకోవాలనే ఆశతో ఆ తల్లిదండ్రులు ఇప్పటి వరకు అందినకాడ అప్పు చేసి సుమారు రూ.30 లక్షలు ఖర్చు చేశారు. ప్రస్తుతం చేతిలో డబ్బు లేకపోవడంతో ఆపన్నహస్తం కోసం ఎదరుచూస్తున్నారు. వివరాలు.. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన సిరిపురం మల్లేశ్ దర్జీ పని చేస్తుండగా అతడి భార్య సంధ్య బీడీ కార్మికురాలు. వీరి పెద్ద కొడుకు చరణ్ (22 ఏళ్లు). ఈ ఏడాది ఫిబ్రవరిలో అయోధ్య-కుమ్మరిపల్లి గ్రామాల శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రగాయాలయ్యాయి. కరీంనగర్‌లోని మెడికవర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా ఆపరేషన్ చేసిన అనంతరం హైదరాబాద్‌లోని రిహాబ్ కేర్ సెంటర్‌కు తరలించారు. చరణ్ ఆరోగ్యం మెరుగుపడాలంటే చాలా సమయం పట్టే అవకాశం ఉండటంతో ప్రతినెలా సుమారు రూ.2.50 లక్షల ఖర్చవుతోంది. తల్లి అతడి వద్దే ఆస్పత్రిలో ఉంటుండగా తండ్రి దర్జీ పనిచేస్తూ కొడుకును బతికించుకునేందుకు నానా తంటాలు పడుతున్నాడు. మరో 4-5 నెలల వరకు చరణ్‌లో కదిలిక వచ్చే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొనడంతో ఆ పేద తల్లిదండ్రులు తమ కొడుకును ఎలాగైనా బతికించుకోవాలనే ఆశతో ఉన్న ఆస్తులు సైతం అమ్మారు. ప్రస్తుతం చేతిలో చిల్లిగవ్వ లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. దాతలు స్పందించి ఆర్థికసాయం అందించాలని వేడుకుంటున్నారు.

దాతలు సాయం చేయడానికి ఫోన్‌పే నంబర్లు : 99638 08663, 91214 04030

'ఖని'లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం కూల్చివేత



నేలమట్టమైన బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం

గోదావరిఖని(రామగుండం): గోదావరిఖని ప్రధాన చౌరస్తాలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని సోమవారం సింగరేణి యాజమాన్యం కూల్చివేసింది. సంస్థకు చెందిన క్వార్టర్‌లో బీఆర్‌ఎస్ కార్యాలయం కొనసాగుతోంది. ఏడాది క్రితం బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో రూ.లక్షలు వెచ్చించి యాజమాన్యం మరమ్మతులు చేసింది. అయితే రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా కార్యాలయంలో ఉన్న సామగ్రిని తీసిన తర్వాత సోమవారం పార్టీ కార్యాలయంతో పాటు ప్రహరీని జేసీబీతో కూల్చివేశారు. సెక్యూరిటీ అధికారి వీరారెడ్డితో పాటు సిబ్బంది దగ్గరుండి కూల్చివేత కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పార్టీ కార్యాలయం పక్కనే హోంగార్డుల కోసం కేటాయించిన క్వార్టర్‌ను కూడా యాజమాన్యం తొలగించింది. రోడ్డు వెడల్పు కోసం మరిన్ని క్వార్టర్లను తొలగించేందుకు యాజమాన్యం ప్రణాళికలు సిద్ధం చేసింది.

ఖోఖో విజేతలు మానకొండూర్, తిమ్మాపూర్

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో సోమవారం జరిగిన అండర్ -17 విభాగం ఖోఖో పోటీల్లో బాలుర విభాగంలో మానకొండూరు మండలం ప్రథమ, హుజురాబాద్ మండలం ద్వితీయ స్థానం సాధించాయి. బాలికల విభాగంలో తిమ్మాపూర్ మండలం ప్రథమ, గంగాధర మండలం ద్వితీయస్థానంలో నిలిచాయి. పోటీలకు జిల్లాలోని 16 మండలాల నుంచి 380 మంది బాలబాలికలు హాజరయ్యారు. పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా మహేందర్‌రావు హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. భవిష్యత్తులో విద్య, ఉద్యోగ అవకాశాల్లో క్రీడా రిజర్వేషన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం బాలబాలికలకు వేర్వేరుగా ఖోఖో పోటీలు నిర్వహించారు. ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.వేణుగోపాల్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, ఎండీ యూనిష్‌పాష, పోటీల నిర్వహణ కన్వీనర్ వంగపల్లి సూర్యప్రకాశ్, అంతటి శంకరయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు బాలసాని రాజ్‌కుమార్‌గౌడ్, కట్ట సంతోష్, వి.శ్రీలత, బాబు శ్రీనివాస్, చందా శ్రీనివాస్, వీరుపాల్‌రెడ్డి, హనుమంతు, రమేశ్, పీసు జ్యోతి, రేణుక, బి.శేఖర్, బి.రేణుక, శివకుమార్, రూపరాణి, కృష్ణవేణి, అశోక్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం విజేతలుగా నిలిచిన జట్లకు జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్ బహుమతులు ప్రదానం చేశారు.

రాజన్నకు కార్తీక శోభ

వేములవాడఅర్బన్: రాజన్న ఆలయం సోమవారం జనంతో కిక్కిరిసింది. కార్తీక మాసం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడి స్వామివారిని దర్శించుకుని, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం ఎదుట రావిచెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించారు.






కోటేశ్వరస్వామి సన్నిధిలో..



వెల్గటూర్(ధర్మపురి): కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా కోటిలింగాల కోటేశ్వరస్వామి సన్నిధిలో గంగాహారతి కార్యక్రమాన్ని శోభాయమానంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహిళలచే దీపోత్సవం కార్యక్రమం చేపట్టారు. మహిళలు ఉత్సాహంగా గోదావరి నదిలో దీపాలు వదిలారు. దేవాదాయశాఖ పరిశీలకులు రాజమౌళి, ఈవో కాంతారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ పదిరె నారాయణరావు, రేగొండ రామన్న, అర్చకులు సంజీవ్, నాగరాజు, శంకరయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



కొండగట్టులో..

మల్యాల(చొప్పదండి): కొండగట్టు అంజన్న సన్నిధిలో సోమవారం దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. దీపాలు వెలిగించి, భజనలు చేశారు.



హారతి గైకొనుమా..

ధర్మపురి: కార్తీకమాసం సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామి సన్నిధిలో మూడోరోజు సోమవారం సాయంత్రం గంగాహారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయం నుంచి గోదావరినదికి మేళతాళాలు, మంగళవాయిద్యాలతో బయలుదేరి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక శ్రీశారదా మహిళా మండలి, వాసవీ మహిళా మండలి సభ్యులు, కరీంనగర్‌కు చెందిన తిరుమల సేవా గ్రూప్ సభ్యుల కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో శ్రీనివాస్, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

